క్లుప్తంగా

విద్యార్థులకు గుర్తింపు కార్డుల పంపిణీ


గుర్తింపు కార్డులు అందుకున్న విద్యార్థినులు

నిడమర్రు: పెదనింద్రకొలను జెడ్పీ స్కూల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో దాత వేగేశ్న రామరాజు రూ.20 వేల ఆర్థిక సహకారంతో 520 మంది విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందించారు. ఈ సందర్భంగా దాత వేగేశ్న రామరాజును ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు జాకబ్‌రాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సతీష్ పాల్గొన్నారు. సైన్స్ టీచర్ జాకబ్‌రాజు ఆర్థిక సహకారంతో టెన్త్ విద్యార్థులకు జీవశాస్త్రంకు సంబంధించిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

భూ సంబంధిత సమస్యలపై 512 అర్జీలు

దెందులూరు: మండలంలో గత 12రోజులుగా నిర్వహించిన రెవెన్యూ రీసర్వే గ్రామ సభలో 512 భూ సంబంధిత అర్జీలు అందాయని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. మంగళవారం సీతంపేటలో మండల సర్వేయర్ రమణారావు ఆధ్వర్యంలో సర్పంచ్ పరస లక్ష్మి సుజాత అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభ జరిగింది. బాధితులనుంచి ఫిర్యాదులను తహసీల్దార్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, వీఆర్వో కిషోర్, కోఆపరేటివ్ సొసైటీ మాజీ ప్రెసిడెంట్ పర్వతనేని రామకృష్ణ, గ్రామస్తులు ఉన్నారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు కొవ్వలి విద్యార్థి


వి.చార్లెస్ వెస్లీ

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి వి.చార్లెస్ వెస్లీ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం జీఎస్ఎల్ఎన్‌వీ శర్మ తెలిపారు. మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 22 వరకు ఛత్తీస్‌గఢ్‌లో రాష్ట్రం రాజానందిగంలో నిర్వహించిన 68వ జాతీయస్థాయి అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలబాలిక బాస్కెట్‌బాల్ పోటీలకు వెస్లీ ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. తనకున్న ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో శిక్షణనిచ్చామని తెలిపారు. వెస్లీ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అక్రమంగా ఎర్రమట్టి రవాణా

దెందులూరు: ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, బిల్లులు లేకుండా అక్రమంగా ఎర్రమట్టిని అనంతపల్లి నుంచి టిప్పర్లతో గన్నవరం తరలిస్తుండగా దాడి చేసి అడ్డుకున్నట్టు దెందులూరు తహసీల్దార్ బి సుమతి తెలిపారు.ఈ దాడిలో 3 టిప్పర్లను గుండుగొలను వద్ద సీజ్ చేసినట్టు ఆమె తెలిపారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ కేసు నమోదు చేసి ఎంఎండీఆర్ సెక్షన్లు నమోదు చేశామన్నారు. 3 టిప్పర్లకు సంబంధించి ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు ఆయన మంగళవారం తెలిపారు. ఈ మట్టి ఎక్కడ నుంచి సేకరించారనే వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

8న బీకేఎంయూ జిల్లా సమావేశం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) ఏలూరు జిల్లా సమితి విస్తృతస్థాయి సమావేశం ఈ నెల 8న శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కామవరపుకోటలో నిర్వహించనున్నట్టు బీకేఎంయూ ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బండి వెంకటేశ్వరరావు, కుంచే వసంతరావు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కామవరపుకోటలో ద్వారకాతిరుమల వెళ్లే రోడ్డులోని గ్రోమోర్ ఎరువుల కొట్టు బిల్డింగుపై భాగంలో సమావేశం నిర్వహించనున్నట్టు వారు పేర్కొన్నారు. సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామని నాయకులు తెలిపారు.

తపాలా శాఖ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్

ఏలూరు (టూటౌన్): భారత ప్రభుత్వం తపాలా శాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా పోస్టుమాన్ ద్వారా ఇంటి వద్దనే డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్స్ (జీవన్ ప్రమాణ్ లైఫ్ సర్టిఫికేట్స్) సమర్పించే సదుపాయం కల్పించబడిందని ఏలూరు డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ ఎస్ శ్రీకర్ బాబు మంగళవారం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, అనుబంధ సంస్థల పెన్షన్‌దారులు మీ సమీప తపాలా కార్యాలయంలో, డోర్ స్టెప్ రిక్వెస్ట్ ద్వారా వారి ఇంటి వద్దనే పోస్ట్‌మేన్ ద్వారా సమర్పించవచ్చునన్నారు. డోర్ స్టెప్ రిక్వెస్ట్ కోసం గూగుల్ ప్లే స్టోర్‌లోని పోస్ట్ ఇన్ఫో యాప్ ద్వారా రిక్వెస్ట్ పెడితే సంబంధిత పోస్టుమాన్ ఫోన్ చేసి సర్వీస్ అందజేస్తారన్నారు. వివరాలకు ఏలూరులోని బ్రాంచి మేనేజర్ కె.రాజేష్‌ను సంప్రదించాలని తెలిపారు.

వాతావరణ మార్పులతో రైతన్నల బెంబేలు

గణపవరం: ఆరుగాలం కష్టపడి పండించిన సార్వా పంట చేతికొచ్చే సమయంలో వాతావరణ మార్పులు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఇప్పటికే చాలామంది రైతులు వరి కోతలు పూర్తిచేసి ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ దశలో వాతావరణ మార్పులు రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. వారం రోజులుగా వాతావరణం రైతులతో దోబూచులాడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాతావరణం మబ్బులు కమ్మి, చినుకులు కురవడంతో రైతులు బెంబేలెత్తి పోతున్నారు. ఎండబెట్టిన ధాన్యం, నెట్టుకట్టిన బస్తాలు వర్షం బారిన పడకుండా సంరక్షించుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఒక పక్క విపరీతమైన ఎండ, ఉక్కబోత ప్రజలను ఠారెత్తిస్తుండగా, కొద్ది సేపటికే ఆకాశం మేఘావృతమై వర్షం కురడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


ఎండబెట్టిన ధాన్యాన్ని తిరగబెడుతున్న రైతులు

ముమ్మరంగా వరి కోతలు

మండలంలోని పిప్పర, చిలకంపాడు, కాశిపాడు, వాకపల్లి, వీరేశ్వరపురం, వల్లూరు తదితర గ్రామాల్లో సార్వా వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొందరు రైతులు వరికోత యంత్రాలతో మాసూళ్లు చేస్తుండగా, మరికొందరు కూలీలతో కోత కోయిస్తున్నారు. ధాన్యాన్ని రైతులు రోడ్లమీదికి, సమీప పుంతల్లోకి చేరవేసి ఆరబెట్టుకుంటున్నారు. ఈ సమయంలో నాలుగు రోజులుగా ఏదో ఒక సమయంలో వర్షం పడుతుండటంతో రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. రైతులు ధాన్యం ఎండబెట్టి సాయంత్రం వరకూ కాపలా కాస్తున్నారు. సాయంత్రం రాసులపై బరకాలు, టార్పాలిన్లు కప్పి వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పూర్తి ఆరుదల ఉన్న ధాన్యాన్ని మద్దతు ధరకు మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. ధాన్యంలో తేమశాతం 17 పాయింట్ల కన్నా ఎక్కువగా ఉంటే ఒక పాయింట్‌కు ఇరవై రూపాయల చొప్పున కోత విధించడంతో రైతులంతా యంత్రాలతో కోసిన ధాన్యాన్ని ఎండబెట్టుకుంటున్నారు. ఈ సార్వాలో పెట్టుబడులు బాగా పెరిగినా పంట దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. ఇంతవరకూ మాసూలుచేసిన రైతులెవ్వరికీ ఎకరాకు 40 బస్తాలకు మించి దిగుబడి రాలేదు. సార్వా ఆరంభంలో భారీవర్షాల కారణంగా నారుమడులు, వరినాట్లు పూర్తిగా నీటమునిగి పనికిరాకుండా పోవడంతో రెండోసారి నారుమడులు, వరినాట్లు వేయాల్సి వచ్చింది. ఈ దశలో కూడా భారీ వర్షాలకు నారుమడులు దెబ్బతినడంతో రైతులు ఇతర ప్రాంతాల నుంచి వరి నారు కొని తెచ్చుకుని నాట్లు వేసుకున్నారు. దీనితో రైతులకు ఎకరాకు ఐదారువేల రూపాయలు అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. తెగుళ్లు, దోమపోటు, ఎలుకల బెడద వంటి అవరోధాలను అధిగమించి సార్వా పంటను అందుకోవడానికి రైతులు ఎదురు చూస్తు న్న తరుణంలో వాతావరణం వారిని బెంబేలెత్తిస్తోంది.

25వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు

ఉంగుటూరు నియోజకవర్గంలో దాదాపు 25వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. మెట్ట ప్రాంతాలైన ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో 15,500 హెక్టార్ల విస్తీర్ణంలో వరి పంట వేయగా 40 శాతం మాసూళ్లు పూర్తయ్యాయి. డెల్టా ప్రాంతమైన గణపవరం, నిడమర్రు మండలాల్లో 10,500 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేయగా ఇప్పటికి 10 నుంచి 15శాతం వరికోతలు పూర్తికాగా, మిగిలిన రైతులు ఈవారంలో కోతలు పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. పూర్తి ఆరుదల ధాన్యం ఎకరాకు 35 నుంచి 40 బస్తాలు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. సార్వా పంట చేతికందిందని సంబరపడుతున్న తరుణంలో వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను కలవరపెడుతున్నాయి.


ధాన్యం రాశులు తడవకుండా బరకాలు కప్పిన దృశ్యం


చేలల్లోని ధాన్యం పుంతకు తరలిస్తున్న రైతులు


యంత్రంతో సార్వా కోత కోస్తున్న దృశ్యం

విరాట్ కోహ్లీ భారతావనికి ఆదర్శనీయుడు


విరాట్ కోహ్లీ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు

దెందులూరు: క్రికెట్ ప్రపంచంలోనే అరుదైన రికార్డులు సాధించిన నంబర్ వన్ క్రీడాకారుడిగా విరాట్ కోహ్లీ భారతావనికి ఆదర్శప్రాయుడని మసీదు యూత్ అన్నారు. మంగళవారం గోపన్నపాలెం పంచాయతీ మసీదుపాడు క్రాస్ వద్ద భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏలూరు- జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డులో రెండు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కేకులు కట్ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

దెందులూరు: రైతులు పండించిన ధాన్యాన్నికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని వ్యవసాయ సాగు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వై సుబ్బారావు అన్నారు. గోనె సంచులు పూర్తిస్థాయిలో సొసైటీలకు సరఫరా చేశామన్నారు. మంగళవారం గాలాయగూడెంలో కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని టీడీపీ దెందులూరు మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), తెలుగు యువత దెందులూరు నియోజకవర్గం అధ్యక్షుడు మోత్కూరి నాని బాబు ప్రారంభోత్సవం చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ గారపాటి కొండయ్య చౌదరి, దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి డి వెంకటేశ్వరరావు, కోపరేటివ్ సొసైటీ కార్యదర్శి పూజారి సుబ్బారావు, రైతు, సానిగూడెం మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాసరావు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు


భీమడోలు గోదావరి కాలువపై పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

భీమడోలు: నాగులచవితి పర్వదినాన్ని మండలంలోని ప్రజలంతా మంగళవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గుండుగొలను, సాయన్నపాలెం గ్రామాల్లో స్వయంభువుగా వెలిసిన ఆలయాల్లో మంగళవారం తెల్లవారు జాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భీమడోలు గోదావరి కాలువ గట్టుపై గల సహజ సిద్ధమైన పుట్ట వద్ద పెద్ద ఎత్తున పూజలు చేశారు.

పుట్టల వద్ద పూజలు

దెందులూరు: నాగుల చవితి పూజలు మండలంలో గ్రామ గ్రామాన ఆలయాలు, పొలాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గాలాయగూడెంలోని ప్రసిద్ధిగాంచిన భీమేశ్వర ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాలాయగూడెం శివారు ప్రాంతాల నుంచి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. ఆలయంలోని శివలింగాన్ని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతి గ్రామంలోనూ పొలాలకు భక్తులు వెళ్లి పుట్టలను అలంకరించి నాగేంద్ర స్వామికి పూజలు చేశారు.

గ్రామాల్లో నాగుల చవితి సందడి


ఉంగుటూరు: కైకరం నాగమ్మతల్లికి పూజలు చేస్తున్న పాట్నా హైకోర్టు న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి

ఉంగుటూరు: నాగుల చవితి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో సందడి నెలకొంది. రైతులు, భక్తులు తమ కుటుంబాలతో పొలాల్లోని పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రుడికి పూజలు చేశారు. బాదంపూడి దత్త బాల సుబ్రహమణ్యస్వామికి అభిషేకాలు చేశారు. కై కరం నాగమ్మతల్లి ఆలయంలో బీహార్ రాష్ట్రం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి గున్ను అనుపమ చక్రవర్తి లక్ష్మణరావు దంపతులు నాగమ్మతల్లికి పాలు పోసి పూజలు చేశారు. రామన్నగూడెం నాగమ్మతల్లి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

వైభవంగా నవహారతులు



గంగా దేవికి నవహారతులిస్తున్న కాశీ నుంచి వచ్చిన వేద పండితులు, దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

నిడమర్రు: మందలపర్రులోని ఉమానీలకంఠేశ్వర పంచాయతన క్షేత్రంలో గంగాదేవికి నవహారతుల కార్యక్రమం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ నుంచి వచ్చిన వేద పండితులు కాశీలో గంగామాతకు ఇచ్చే మాదిరిగా క్షేత్రంలోని కొలనువద్ద నవహారుతులను అందించారు. ఈ హారతులను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాలనుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాగణం కిటకిటలాడింది. ముందుగా లక్ష ఒత్తులతో ఆలయ ప్రాగణంలోని కొలను వద్ద మహిళలు దీపోత్సవం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో 8 వేల మంది భక్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై వీరప్రసాద్

నిడమర్రు: మత్తు పదార్థాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని నిడమర్రు ఎస్సై ఎస్.వీరప్రసాద్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం బావాయిపాలెం జెడ్పీస్కూల్లో మాదక ద్రవ్యాలు, బాల్య వివాహాల నిర్మూలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే అనారోగ్యం పాలై జీవితం అంధకారమవుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే చదువులతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. సిగరెట్లు, మద్యం సేవించడం వంటి చెడు అలవాట్ల వల్ల కలిగే అనర్థాలపై, బాల్యవివాహ చట్టాలపైనా, అతిగా సెల్‌ఫోన్ వినియోగిస్తే జరిగే అనర్థాలు. ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగంతో పెరుగుతున్న సైబర్ నేరాలు వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగం లాంటి చర్యలు పాల్పడినట్లుగా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కణితి కృష్ణకుమార్, మల్లేశ్వరరావు తదితరులున్నారు.

విద్యార్థులు స్వీయక్రమశిక్షణతో మెలగాలి


స్వీయక్రమశిక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వీరప్రసాద్

నిడమర్రు: విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని, దీనిని దుర్వినియోగం చేసుకుంటే జీవితాంతం బాధపడక తప్పదని నిడమర్రు ఎస్సై వీరప్రసాద్ అన్నారు. మంగళవారం చానమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వీయక్రమశిక్షణ, ఈవ్‌టీజింగ్ దుష్ఫలితాలు, సత్ప్రవర్తనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, వికృత పోకడలు పతనానికి నాంది పలుకుతాయన్నారు. హెయిర్ స్టైల్, డ్రెస్‌కోడ్ విషయంలో సంయమనం పాటించాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే పోలీసు కేసులతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. విద్యార్థులంతా స్నేహభావంతో, సోదరభావంతో మెలగాలని సూచించారు. చదువులో రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలు అందుకోవాలని సూచించారు. విద్యార్థులతో ఈవ్‌టీజింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బి.దంజు, ఉపాధ్యాయులు భీమాల ప్రాసాద్, గంటా లక్ష్మీనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి


పోలసానిపల్లిలో పాడైన ఫ్లోర్ టైల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

భీమడోలు: పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకులను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత గురుకులం ఆవరణలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రాంగణాన్ని, తరగతి గదులు, డైనింగ్ హాల్, బాత్ రూములను ఆయన పరిశీలించి అంతటా అపరిశుభ్రత నెలకొందని అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులు నిద్రపోయే హాల్ కింది భాగంలో టైల్స్ శిథిలమడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. కళాశాలలోని 700 మంది బాలికలు శిథిలావస్థకు చేరిన డైనింగ్ హాల్‌ల్లో ఇబ్బంది పడుతూ విద్యార్థులు భోజనాలు చేస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. నూతన డైనింగ్ హాల్‌ను నిర్మించాలని ఉన్నతాధికారుల దృష్టికి పలుసార్లు తీసుకెళ్లామని ప్రిన్సిపల్ ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు, వాటర్ ట్యాంకు నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రత్తి మదన్, మునగంటి రమేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిసిన నాయకులు


మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిసిన పార్టీ నేతలు

దెందులూరు: దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి మంగళవారం ఆయన కార్యాలయంలో గాలాయగూడెం వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు కలిశారు. గాలాయగూడెం సర్పంచ్ చిలకావెంకట సుబ్బారావు, పార్టీ నాయకులు బోయపాటి గణేష్, ముసునూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీనాయకులు అబ్బయ్యచౌదరిని కలిశారు. గాలాయగూడెం, నాగులదేవునిపాడులో పరిస్థితులను వివరించారు. రెండుగ్రామాలకు రావాల్సిందిగా అబ్బయ్య చౌదరిని వారు ఆహ్వానించారు.

అశోక్ శ్రీనివాస్ మృతి తీరని లోటు

కామవరపుకోట: మేడవరపు అశోక్ శ్రీనివాస్ మృతి వైఎస్సార్‌సీపీకి, ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కళ్ల చెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత మేడవరపు అశోక్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను మంగళవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశోక్ శ్రీనివాస్ వైఎస్సార్‌సీపీకి విధేయుడిగా ఉంటూ, పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశారన్నారు. 2019లో సార్వత్రిక ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి గెలుపునకు ఎనలేని కృషి చేశారన్నారు. ఈ ప్రాంత ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారికి అన్ని వేళల అందుబాటులో ఉంటూ సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కడిమి రమేష్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మేడూరి రంగ బాబు, కామిరెడ్డి నాని, జానంపేట బాబు, ముంగర సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామీణ అభివృద్ధి లక్ష్య సాధనపై ఉద్యోగులకు శిక్షణ

దెందులూరు: గ్రామీణ అభివృద్ధి లక్ష్యాల సాధన ప్రభుత్వ నిబంధనల అమలులో శిక్షణ దెందులూరు మండలం నుంచి ఆరుగురు ఎంపికయ్యారని దెందులూరు ఎంపీడీఓ కె.శ్రీదేవి తెలిపారు. తాను ఈఓపీఆర్‌డీ, ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లు, ఇద్దరు గ్రామ కార్యదర్శుల శిక్షణకు ఎంపికయ్యారని గురువారం నుంచి ఏలూరులో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. శిక్షణకు వెళ్లే ఉద్యోగులకు సమాచారాన్ని అందజేశామని ఎంపీడీఓ వివరించారు.

అన్నదానం

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకుని 200మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దాతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ అన్నదానం కార్యక్రమానికి కానుమోలు గ్రామానికి చెందిన చింతల విశ్వనాథ్ సాధన దంపతులు ఆర్థిక సాయం అందించారు. వేగిరెడ్డి బాలాజీ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో గుర్తింపు లక్ష్యం


వంగా త్రినేత్ర, గణపవరం


వేగేశ్న తనూశ్రీ, గణపవరం

గణపవరం: తగిన ప్రోత్సాహం ఉంటే గ్రామీణ ప్రాంతంలో కూడా మెరికల్లాంటి క్రీడాకారు లు ఉన్నారని నిరూపించారు. గణపవరం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు నిరూపించారు. నిరుపేద, వ్యవసాయ కుటుంబాలకు చెందిన ఈ విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను చాటారు. జాతీయస్థాయిలో క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకోవడమే లక్ష్యమని గణపవరం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన వంగా త్రినేత్ర, వేగేశ్న తనూశ్రీ అన్నారు. ఈనెల 2, 3 తేదీల్లో వైఎస్సార్‌జిల్లా పులివెందులలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌ టెన్నిస్ పోటీల్లో తృతీయ స్థానం సాధించి, గణపవరం బాలుర ఉన్నత పాఠశాలకు వచ్చిన సందర్భంగా వారు సాక్షితో మాట్లాడారు. త్రినేత్ర, తనూశ్రీ ఇరువురూ సాఫ్ట్‌టెన్నిస్‌లో గతేడాది పిఠాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. క్రీడాకారిణిగా రాణించడంతో పాటు ఐఏఎస్ సాధించాలన్నది తన లక్ష్యమని వంగా త్రినేత్ర తెలుపగా, వ్యాయామ ఉపాధ్యాయినిగా కొలువు సాధించి, గ్రామీణ ప్రాంత విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నది తన లక్ష్యమని తనూశ్రీ తెలిపింది.

వట్లూరులో పొలం బడి

పెదపాడు: రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు గోనె సంచులు అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని వట్లూరులో మంగళవారం పొలం బడి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో రాబోయే రబీ వరి పంటకు వరికి రూ.500, మొక్కజొన్నకు రూ.483, మినుము, పెసర పంటలకు రూ.60 చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

ఉంగుటూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు బుధవారంతో గడువు ముగుస్తుందని ఉంగుటూరు ఎంపీడీవో గంజి రాజ్‌మనోజ్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.